

ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు.

- 8లో ▸



తగ్గుతూ పెరుగుతున్న వరద

ఎస్సారెస్పీకి వరద తగ్గుతూ పెరుగుతోంది. ఇన్‌ఫ్లో ఆధారంగా అధికారులు నీటిని గోదావరిలోకి వదులుతున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
39.1 /23.5

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

2, 3 తేదీల్లో రిసోర్స్‌పర్సన్లకు శిక్షణ

సుభాష్‌నగర్ : బాలోత్సవంలో పాల్గొనే రిసోర్స్‌పర్సన్లకు అక్టోబర్ 2, 3 తేదీల్లో నగరంలోని మల్లు స్వరాజ్యం ట్రస్ట్ భవనంలో శిక్షణ ఇస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నర్రా రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ ప్రయోగాల రూపంలో ఉంటుందన్నారు. 2న గమ్మత్తు గణితం, మ్యాజిక్, 3న సైన్స్, మిరాకిల్ సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణనిస్తామన్నారు. శిక్షణ పొందే ఉపాధ్యాయుల తర్ఫీదుకు కిట్లు ఇస్తామని పేర్కొన్నారు. మానసిక ఒత్తిడి, బట్టీ చదువులు వద్దు.. ఆటపాటలతో చదువులు ముద్దు అన్న రీతిలో నవంబర్ 8, 9 తేదీల్లో బాలోత్సవం ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికోసం రిసోర్స్ పర్సన్‌లకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆలయాలపై ప్రభుత్వ పెత్తనం తొలగించాలి



సుభాష్‌నగర్ : హిందూ ఆలయాలపై ప్రభుత్వ పెత్తనం తొలగించాలని వీహెచ్‌పీ విభాగ్ ప్రముఖ్ తమ్మల కృష్ణ డిమాండ్ చేశారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు దినేష్ ఠాకూర్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆలయాల్లో అన్యమత ఉద్యోగులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. మందిర ప్రాంగణంలో వ్యాపార సముదాయాలను హిందువులకే కేటాయించాలని, అన్యాక్రాంతమౌతున్న దేవాలయ భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. ధర్నా అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ అంకిత్‌కు అందజేశారు. పిట్ల కృష్ణ మహరాజ్, ఇస్కాన్ ప్రతినిధులు రామానందరాయ గవురాధస్, సిద్ధ బలరాం ప్రభుజీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, హిందూ వాహిని జిల్లా అధ్యక్షుడు అనిల్ కదం, లక్ష్మణ్, శశి, గడీల రాములు, హరిదాస్, కృష్ణమూర్తి, గాజుల దయానంద్, రెబ్బ ఆనంద్, నమల్లి శేఖర్, దాత్రిక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డీఏవోపై కమిషనర్‌కు ఫిర్యాదు

డొంకేశ్వర్(ఆర్మూర్) : ఏఈవోలు, రెంజల్ ఏవో మధ్య తలెత్తిన వివాదం జిల్లా వ్యవసాయాధికారి మెడకు చుట్టుకుంటోంది. క్రాప్ సర్వే విషయంలో తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ రెంజల్ ఏవో లక్ష్మీకాంత్ రెడ్డి డీఏవోపై వ్యవసాయ శాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. పెస్టిసైడ్ లైసెన్సు జారీ సందర్భంగా నిబంధనలు పాటించాలన్నందుకు డీఏవో తనపై కక్ష పెంచుకున్నారని, భయపెట్టి లైసెన్సు జారీ చేయించారని ఆరోపించారు. నిబంధనలు అతిక్రమించిన దుకాణ విషయంలో కూడా సాక్ష్యాలు చూపించినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. బోధన్‌కు చెందిన ఒక విత్తన డీలరు సర్టిఫికేషన్ ట్యాగ్స్ మార్చిడి, నకిలీ బిల్లులు జారీ చేస్తున్నాడని రైతులు చేసిన ఫిర్యాదు మేరకు నివేదికను డీఏవోకు పంపితే చర్యలు తీసుకోలేదని లేఖలో పేర్కొన్నారు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి తనను ఇష్టం వచ్చినట్లుగా డిప్యుటేషన్‌పై పంపుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేశారు.

ఏవోపై కలెక్టర్‌కు డీలర్ల ఫిర్యాదు

వ్యవసాయ శాఖలో డీఏవో, రెంజల్ ఏవో మధ్య వివాదం మరింత ముదురుతోంది. డీఏవోపై సోమవారం కమిషనర్‌కు లేఖ రాసిన కొద్ది గంటల్లోనే ఏవో లక్ష్మీకాంత్‌రెడ్డిపై కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. డబ్బులు వసూలు చేస్తూ తమను ఇబ్బంది పెడుతున్నాడని రెంజల్ ప్రాంతానికి చెందిన కొంతమంది డీలర్లు కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. శాఖకు చెందిన కొందరు ఉద్యోగులు చొరవ తీసుకుని డీఏవో, ఏవో మధ్య తలెత్తిన వివాదాన్ని సద్దుమణిగించినట్లు సమాచారం.

జిల్లా క్రికెట్ జట్టు ఖరారు

నిజామాబాద్ నాగారం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–19 ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్‌కు జిల్లా జట్టును ఖరారు చేశారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రసేన్, వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. గురువారం నుంచి 6 వరకు వరంగల్‌లో నిర్వహించే టోర్నీలో జిల్లా జట్టు పాల్గొనుంది. హెడ్ కోచ్‌గా సురేశ్‌బాబు, కోచ్‌గా నయీమ్, ట్రైనర్‌గా లలిత్ రెడ్డి వ్యవహరించనున్నారు.

జట్టు సభ్యులు..

విక్రత్‌రెడ్డి, రక్షిత్, వర్షిత్, ప్రతాప్, నవీన్‌కుమార్, ఎండీ అయాన్, మణికంఠ, ప్రశాంత్, ఖుద్దూస్, గ్రాఫన్, ఎండీ షరాజ్, స్నేహిత్, అజార్, ఎండీ బాయాజిత్, అభినవ్, భూమకరం.



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, రాకేశ్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత

- జిల్లాస్థాయి సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు
- ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలుపై దిశానిర్దేశం
- పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు

నిజామాబాద్ అర్బన్ : విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యతనిస్తూ పనితీరులో స్పష్టమైన మార్పు తెస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన జిల్లాస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, రాకేష్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ప్రగతి గురించి మంత్రి దృష్టికి తెచ్చారు. మంత్రి జూపల్లి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రజలకు పారదర్శకమైన పాలన అందేలా కృషి చేయాలని హితవు పలికారు. అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. సాంకేతిక కారణాలతో కొంతమందికి రుణమాఫీ జరుగనందున, అలాంటి రైతులను గుర్తించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి

రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు

జిల్లాలో అధిక విస్తీర్ణంలో వరి పంట సాగు చేస్తున్నందున అందుకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. అవసరమైన చోట సన్న రకం, దొడ్డు రకం ధాన్యాలకు వేర్వేరుగా కేంద్రాలను నెలకొల్పాలని, ప్రతి కేంద్రంలోనూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వర్షాలు కురిస్తే ధాన్యం తడిసిపోకుండా సరిపడా టార్పాలిన్లు సమకూర్చాలని సూచించారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ.. గత సీజన్లో జిల్లాలో 435 ధాన్యం కొనుగోలు కేంద్రాలు కొనసాగగా, ఈసారి 505 కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెరగాలి

వైద్య రంగంలోనూ స్పష్టమైన మార్పు కనిపించాలని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరుపై ప్రజల్లో నమ్మకం పెంపొందేలా నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. డెంగీ, విష జ్వరాలు, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, అధికారులు కూడా ప్రజలకు జవాబుదారిగా ఉంటూ సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వానికి వచ్చే ప్రతీ పైసా ప్రజల కష్టార్జితం కావడంతో నిధులు వృధా కాకూడదనే ఉద్దేశంతో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నామని అన్నారు. గత పాలకులు లెక్కకు మిక్కిలి అప్పులు చేసిన ఫలితంగా ప్రభుత్వ ఖజానాపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతున్నా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. త్వరలో రైతు భరోసా అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

పాలిటెక్నిక్ కాలేజీని అప్‌గ్రేడ్ చేస్తాం

నిజామాబాద్ పాలిటెక్నిక్ కాలేజీని ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తామని మంత్రి ప్రకటించారు. అదేవిధంగా తెలంగాణ యూనివర్సిటీకి అనుబంధంగా ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన గురించి కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్ట్‌ను పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశానికి ముందు మంత్రి నగరంలో రూ.6 కోట్లతో నిజామాబాద్ నుంచి నర్సీ రోడ్డు మరమ్మతులు, రూ. 4.50 కోట్లతో నిజామాబాద్ – వర్ని రోడ్డు మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, సహకార సంఘాల యూనియన్ చైర్మన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ గంగారెడ్డి, డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయాలని మంత్రి జూపల్లి అన్నారు. ప్రభుత్వ పాఠశాలు, కళాశాలల్లో వసతులను మెరుగుపర్చి నాణ్యమైన బోధన జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. పాఠశాలలకు ఆంగ్ల, తెలుగు దినపత్రికలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సమర్థవంతంగా విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులకు అవార్డులు అందించి ప్రోత్సహించాలని కలెక్టర్‌కు సూచించారు. పాఠశాలల రేషనలైజేషన్ ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేయాలని డీఈవోను ఆదేశించారు.

గంజాయి, కల్తీ కల్లుపై ఉక్కుపాదం



గంజాయి, కల్తీ కల్లు, అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపుతామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆర్మూర్‌లోని మామిడిపల్లి, మోర్తాడ్, భీమ్‌గల్‌లో నిర్మించిన ఎక్సైజ్ భవనాలను ఆయన సోమవారం ప్రారంభించారు. రాష్ట్రంలో గంజాయి, అల్ప్రాజోలం మాట వినబడకూడదనేదే సీఎం రేవంత్‌రెడ్డి ఆశయమని, అందుకు తగిన విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు.


- వివరాలు 8లో..



సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

డీఎస్సీ ఫలితాలు విడుదల

- సర్టిఫికెట్ల పరిశీలనకు 1:3 చొప్పున ఎంపిక
- 9న నియామక పత్రాలు అందజేత



నిజామాబాద్ అర్బన్ : డీఎస్సీ ఫలితాలను సోమ వారం ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలో డీఎస్సీ రాసిన అభ్యర్థుల మార్కులు ర్యాంకుల వారిగా వివరాలను వెల్లడించారు. దీంతో ఆయా సబ్జెక్టులలో ఒక్క పోస్టుకు ముగ్గురు చొప్పున ఎంపిక లిస్టు తయారు చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 1,015 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 601 పోస్టుల భర్తీకి డీఎస్సీ పరీక్ష నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 9న నియామక పత్రాలు అందజేయనున్నారు. కాగా డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుడు రాకేష్ రెడ్డి స్కూల్ అసిస్టెంట్ (పీఈటీ, పీడీ) విభాగాల్లో జిల్లా మొదటి ర్యాంకు సాధించారు. సోషల్ స్టడీస్ విభాగంలో నవీపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన చిన్న సాయిలు, హిందీలో నగరంలోని వినాయక్ నగర్‌కు చెందిన వికాస్‌కు మొదటి ర్యాంకులు సాధించారు.

నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం నుంచి ధ్రువపత్రాల పరిశీలన చేపడుతున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 1:3 పద్ధతి లో ఎంపిక చేసిన అభ్యర్థుల మెయిల్లకు సందేశాలు వస్తాయని, వారు పరిశీలనకు రావాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం5 గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో గెజిటెడ్ ఆఫీసర్ ధృవీకరించిన రెండు జతల జిరాక్స్ కాపీలను తీసుకొని డీఈవో కార్యాలయానికి రావాలని సూచించారు.

‘తెయూ భూములకు ఎసరు’పై సీఎంవో సీరియస్!

రిజిస్ట్రార్ యాదగిరిపై ఇన్‌చార్జి వీసీ సందీప్ కుమార్ సుల్తానియా ఆగ్రహం

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ‘తెలంగాణ యూనివర్సిటీ భూములకు ఎసరు’ శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి సోమవారం సీఎం కార్యాలయం స్పందించింది. 50 ఎకరాల భూమిని కొందరు కాజేసేందుకు ప్రయత్నిస్తుండగా, తెయూ అధికారులు ఏం చేస్తున్నారని సీరియస్ అయింది. విశ్వవిద్యాలయ భూములకు సంబంధించి పూర్తి వివరాలు తమకు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు సమాచారం. సోమవారం యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ సందీప్ కుమార్ సుల్తానియా రిజిస్ట్రార్ యాదగిరిని హైదరాబాద్‌లోని కార్యాలయానికి పిలిపించుకుని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. తెయూ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రయివేటు వ్యక్తులకు అనుకూలంగా తీర్పు వచ్చిందనే వివరాలపై ఉన్నతాధికారులు ప్రశ్నించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. యూనివర్సిటీ భూములపై కోర్టులో తమ వాదనలు సరిగ్గా విన్పించలేదని, సరైన ఆధారాలు పూర్తి స్థాయిలో సమర్పించకపోవడంతోనే కోర్టులో ప్రయివేటు వ్యక్తులకు అనుకూలమైన తీర్పు వచ్చిందని ఉన్నతాధికారులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. కోర్టు తీర్పు, భూముల అన్యాక్రాంతం విషయాన్ని నేటికీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాకపోవడంతో ఇందులో రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ యాదగిరి పాత్రపై అనేక ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

కాగా తెయూ భూముల అన్యాక్రాంతంపై సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనం అటు వర్సిటీ అధికార వర్గాల్లో కలకలం రేపింది. విద్యార్థి సంఘాలు, యూనివర్సిటీ అధికార వర్గాలు, మేధావులు, విద్యావంతులు, ప్రజాప్రతినిధులు ఈ కథనంపై చర్చించుకుంటున్నారు.

నగరంలో ఎనిమిది ట్రాక్‌లతో స్టేడియం

- త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన
- స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, చిత్రంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

నిజామాబాద్ నాగారం : నిజామాబాద్ నగరంలో 8 ట్రాక్‌లతో సింథటిక్ క్రీడా మైదానం నిర్మిస్తామని, త్వరలోనే దానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయిస్తామని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని పాత కలెక్టరేట్ మైదానాన్ని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. మైదానంలో ప్రాక్టీసు చేస్తున్న బాక్సింగ్, హాకీ, బాస్కెట్‌బాల్, హ్యాండ్ బాల్, కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడాకారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడా మైదానాన్ని ధ్వంసం చేసిందన్నారు. క్రీడా మైదానాన్ని తరలించే ప్రయత్నం చేస్తే కాంగ్రెస్ నాయకులు, క్రీడాకారులు, పత్రికలు అడ్డుకున్నాయని గుర్తు చేశారు. క్రీడా మైదానం కావాలని ‘సాక్షి’లో వచ్చిన కథనాలపై నాయకులు ఆయన దృష్టికి తీసుకుపోవడంతో అభినందించారు. ఇప్పటికే స్టేడియం నిర్మాణానికి రూ.9.5కోట్లు కేటాయించామన్నారు.

పోరాటాల ఫలితంగానే స్టేడియం

నిజామాబాద్ మధ్యలో ఉన్న క్రీడా ప్రాంగణ స్థలాన్ని గత ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు అమ్మాలని చూసిందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. నాయకులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పోరాటం చేయడంతో ఈ రోజు స్టేడియం నిర్మాణానికి అడుగులు పడుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. స్పోర్ట్స్ హబ్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. నగరంలో కూడా ఒలింపిక్ స్థాయి ప్రమాణాలతో క్రీడా అకాడమీలు ఏర్పాటు చేసుకుందామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశ వేణు, డీవైఎస్‌వో ముత్తెన్న, నాయకులు సయ్యద్‌ఖైసర్, రామర్తి గోపి, రాంభూపాల్, రామకృష్ణ, న్యాయవాది రాము, దయాకర్‌గౌడ్, సర్దార్ నరేందర్‌సింగ్, ఒలింపిక్ సంఘం కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య పాల్గొన్నారు.

కాసుల కోసం కడుపు కోతలు

పెరుగుతున్న సిజేరియన్లు

- ప్రైవేట్ ఆస్పత్రుల్లో యథేచ్ఛగా ఆపరేషన్లు
- అవసరం లేకున్నా భయపెట్టి సంతకాలు తీసుకుంటున్న వైనం
- పట్టించుకోని అధికారులు

నిజామాబాద్ నాగారం : సాధారణ ప్రసవాలు చేసి తల్లిబిడ్డ ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా.. ప్రైవేట్ ఆస్పత్రుల్లో యథేచ్ఛగా సిజేరియన్లు చేస్తున్నారు. డబ్బుల కోసం అవసరం లేకున్నా ఆపరేషన్లు చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కరువవడంతో జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇటీవల సిజేరియన్లు పెరిగాయి. కుటుంబ సభ్యులను భయపెట్టి మరీ సంతకాలు తీసుకుంటూ మహిళల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. జిల్లాలో 120 వరకు గైనిక్ ఆస్పత్రులు ఉన్నాయి. ప్రతి నెల గర్భిణులు ఆయా ఆస్పత్రులకు చెకప్ కోసం వస్తున్నారు. గైనిక్ డాక్టర్ సలహాలు, సూచనలు పాటిస్తూ మందులు వాడుతున్నారు. అయినా నెలలు నిండగానే డెలివరీ కోసం వస్తే చాలు పిండం అడ్డం తిరిగిందని, పేగు మెడకు చుట్టుకుందని, ఉమ్మ నీరు పోతుందని, ఇలా నానా రకాల కారణాలు చెప్పి మరీ కుటుంబ సభ్యులను ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, వారి సిబ్బంది భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. సాధారణ డెలివరీ చేయాలంటే గంటలు, అవసరమైతే రెండు, మూడు రోజుల సమయం పడుతుందని ఏమైనా జరిగితే మాకు సంబంధం లేదని చెబుతున్నారు. సిజేరియన్లు చేయకపోతే తల్లికి, బిడ్డకు ప్రమాదం అని చెప్పడంతో తప్పని పరిస్థితిలో కుటుంబ సభ్యులు ఒప్పుకుంటున్నారు. కేసు షీట్ మీద సంతకాలు చేసుకొని 20 నిమిషాల్లో సిజేరియన్లు చేసి తల్లి, బిడ్డ క్షేమం అని చేతుల్లో పెడుతున్నారు.

రూ.60 వేల వరకు వసూలు

సాధారణ డెలివరీలు చేస్తే రూ.12వేలు మాత్రం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. పైగా 24గంటల్లోపే ఇంటికి క్షేమంగా వెళ్లి పోవచ్చు. అదే సిజేరియన్లు చేస్తే రూ. 40వేల నుంచి రూ. 60వేల వరకు వసూలు చేస్తున్నారు. కేసు తీవ్రతను బట్టి ఫీజు పెరిగే అవకాశం ఉంటుంది. రక్త పరీక్షలు, స్కానింగ్, మందులు, మత్తు మందు, ఇతరత్ర ఖర్చులు సుమారు రూ. 15వేల వరకు అవుతుంది. సిజేరియన్లు చేస్తే ప్రైవేట్ ఆస్పత్రులకు లాభం. అధిక మొత్తంలో ఫీజులు వసూళ్లు చేయవచ్చు. అదే సాధారణ డెలివరీలు చేస్తే మహిళ ఆరోగ్యంగా ఉండటంతో పాటు వారికి డబ్బు ఆదా అవుతుంది.

పర్యవేక్షణ అంతంతే

ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లు పెరుగున్నా.. పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. గైనిక్ ఆస్పత్రులపై నిఘా లేకపోవడంతో నార్మల్ డెలివరీలు బాగా తగ్గిపోయాయి. గతంలో కలెక్టర్ ప్రత్యేకంగా నిఘా పెట్టి ఒక కమిటీ ఏర్పాటు చేసి తనిఖీలు చేయడంతో వైద్యులు సిజేరియన్లు తగ్గించారు. ప్రస్తుతం పట్టించుకునే వారు లేకపోవడంతో నార్మల్ డెలివరీలు పదుల సంఖ్యలో చేస్తే వందల్లో సిజేరియన్లు చేస్తున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో డెలివరీలు..

నెల	నార్మల్	సిజేరియన్లు
జనవరి	104	1,049
ఫిబ్రవరి	121	813
మార్చి	166	935
ఏప్రిల్	128	861
మే	119	845
జూన్	79	656
జూలై	67	601
ఆగస్టు	36	335

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లు పెరుగుతున్నాయి. అయినా సీజనల్ వ్యాధుల ప్రభావం ఉండడంతో ఎక్కువగా దృష్టి పెట్టలేదు. దీనిపై కచ్చితంగా సమీక్షిస్తాం. ఒత్తిడి చేసి మరీ సిజేరియన్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు చేస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

– రాజశ్రీ, డీఎంహెచ్‌వో

విత్తన మక్క విఫలం



■ డొంకేశ్వర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన కొంత మంది రైతులతో విత్తన మక్క సాగు చేసివ్వాలని ఓ వ్యాపారి ముందస్తు ఒప్పందం చేసుకున్నారు. ఎకరానికి 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని గ్యారంటీ రాసిచ్చాడు. వ్యాపారి ఇచ్చిన విత్తనాలతో రైతులు పంట సాగు చేయగా, విత్తన లోపం, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా బుట్ట సక్రమంగా ఎదగలేదు. ఎకరానికి ఐదారు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది.

- ఆశించిన స్థాయిలో రాని దిగుబడి
- ఎకరానికి 5 నుంచి 10 క్వింటాళ్లకే పరిమితం

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సొంతంగా విత్తన మక్క సాగు చేసిన రైతులకు ఎదురు దెబ్బ తగిలింది. అలాగే ముందస్తు ఒప్పందంతో రైతులతో పంట సాగు చేయించిన వ్యాపారుల అంచనాలు సైతం తలకిందులయ్యాయి. విత్తన లోపంతో పాటు ప్రతికూల వాతావరణం కారణంగా విత్తన మక్కసాగు విఫలమైంది. పంటలో ఎదుగుదల లోపించి దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. ఎకరానికి 5 నుంచి 10 క్వింటాళ్లు మాత్రమే వస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 52,762 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగుకాగా, ఇందులో 40శాతం వరకు విత్తన మక్క ఉంది. మార్కెట్‌లో లభించిన వివిధ రకాల విత్తనాలు, అలాగే వ్యాపారులు ఇచ్చిన విత్తనాలు వేశారు. వర్షాలకు తోడు విత్తనాల లోపం కారణంగా సొంతంగా సాగు చేసిన రైతులకు ఎకరానికి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. దీనిని మార్కెట్‌లో క్వింటాలుకు రూ.3వేల వరకు విక్రయిస్తున్నారు. లోకల్ మక్కకు రూ.2,400 ధర లభిస్తోంది. అదే విధంగా వ్యాపారులు ఇచ్చిన విత్తన మక్కకు ఎకరానికి 10 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తే రూ. 60వేలు, పది క్వింటాళ్ల లోపు వస్తే రూ.50వేలు ఇస్తామని రైతులతో ఒప్పందాలు చేసుకుని ఉన్నారు. ప్రస్తుతం ఎకరానికి 10 క్వింటాళ్ల లోపే రావడంతో నష్టమైనా రైతులకు ఇచ్చిన అగ్రిమెంట్ ప్రకారం డబ్బులు కట్టివ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

క్లుప్తంగా

ఖోఖో ఎంపిక పోటీలు



వేల్పూర్: జిల్లాస్థాయి సబ్ జూనియర్ ఖోఖో భీమ్‌గల్ జోన్ పోటీలను మండల కేంద్రంలోని హైస్కూల్‌లో సోమవారం నిర్వహించారు. ఎంఈవో రేణుక హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అండర్ -14 బాలుర, బాలికల విభాగంలో జిల్లాస్థాయి ఎంపిక కోసం క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వేల్పూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజన్న, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు దేవానందం, వ్యాయామ ఉపాధ్యాయులు రాజేందర్, గంగాధర్, రాజేశ్వర్, దేవ సుకన్య, శరత్, గీత తదితరులు పాల్గొన్నారు.

'రైతు హామీల సాధన దీక్ష'లో బీజేపీ శ్రేణులు



సుభాష్‌నగర్: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ బీజేపీ ప్రజాప్రతినిధులు చేపట్టిన 24 గంటల రైతు హామీల సాధన దీక్షలో జిల్లాకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారితోపాటు ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జీల ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. జిల్లా నుంచి సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఆయా మోర్చల ప్రతినిధులు తరలివెళ్లినవారిలో ఉన్నారు.

తల్లీకూతుళ్ల ప్రాణాలు కాపాడిన వీఆర్‌ఏ



ఎడపల్లి(బోధన్): మతిస్థిమితం లేని ఓ మహిళ తన కుమార్తెతో కలిసి ఆత్మహత్యాయత్నం చేయగా వీఆర్‌ఏ వారి ప్రాణాలను కాపాడారు. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని జానకంపేట్ గ్రామ శివారులోని అశోక్ సాగర్ చెరువు వద్దకు సోమిడి మంజుల అనే మహిళ తన మూడేళ్ల కుమార్తెను తీసుకొని వెళ్లింది. నీటిలో దూకేందుకు ప్రయత్నిస్తుండగా.. గమనించిన వీఆర్‌ఏ కరుణాకర్ అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించాడు. ఎడపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మహిళను విచారించారు. సదరు మహిళది జానకంపేట అని, మతిస్థిమితం లేదని తెలుసుకొని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మురికికాలువలో పూడికతీత



సాక్షి ఎఫెక్ట్..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలకేంద్రం గోపాల్‌పేటలో రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మురికి కాలువ ధ్వంసమై రోడ్డుపై మురికినీరు పారుతుండడంతో జీపీ అధికారులు స్పందించి మురికికాలువలో పూడికను తీయించారు. మురికికాలువ ధ్వంసమై రోడ్డుపై మురికినీరు పారుతున్న విషయమై 'సాక్షి' లో సోమవారం 'రోడ్డుపైనే పారుతున్న మురుగు'అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి, గోపాల్‌పేట పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య గ్రామంలో రహదారి విస్తరణపనుల్లో భాగంగా ధ్వంసమైన మురికికాలువలో నుండి జేసీబీ ద్వారా పూడికను తొలగింపజేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గంజాయి, కల్తీ కల్లుపై ఉక్కుపాదం

- తనిఖీలకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక బృందాలను పంపిస్తాం
- ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- ఆర్మూర్, మోర్తాడ్, భీమ్‌గల్‌లో ఎక్సైజ్ భవనాల ప్రారంభం



ఎక్సైజ్ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి



ఆర్మూర్‌లో ఎక్సైజ్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ఆర్మూర్/బాల్కొండ: గంజాయి, కల్తీ కల్లు, అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపుతామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆర్మూర్ పట్టణ పరిధిలోని మామిడిపల్లి, మోర్తాడ్, భీమ్‌గల్‌లో నిర్మించిన ఎక్సైజ్ భవనాలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. ఎందరో ప్రాణాత్యాగాల కారణంగా వచ్చిన తెలంగాణను అభివృద్ధి వైపు తీసుకెళ్లేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడ కూడా గంజాయి, అల్ప్రాజోలం మాట వినబడకూడదనేదే సీఎం రేవంత్‌రెడ్డి ఆశయమని, అందుకు తగిన విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో విచ్చలవిడిగా మాదకద్రవ్యాలను పెంచిపోషించిందని, దాని పర్యావసానమే డ్రగ్స్ కలకలమని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గత ప్రభుత్వం అనధికార మద్యం షాపులను ప్రోత్సహించిందని, వేలాదిగా బెల్టు షాపులు వెలియడంతో అనేక కుటుంబాలు ఆగమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తనిఖీల కోసం హైదరాబాద్ నుంచి ప్రత్యేక బృందాలను పంపిస్తామని, ఎక్కడైనా గంజాయి, మాదకద్రవ్యాలు పట్టుబడితే సంబంధిత అధికారులు చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. లైసెన్సులు లేకుండా మద్యం దుకాణాలను నిర్వహిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణపై ఆయన స్పందిస్తూ.. చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. ఆయా చోట్ల ఎక్సైజ్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆర్మూర్‌లో ఎక్సైజ్ స్టేషన్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఎక్సైజ్ అధికారులతో సమావేశమైన మంత్రి.. గడిచిన ఐదేళ్లలో ఎన్ని కేసులు నమోదయ్యాయి? ఎంత మందికి శిక్ష ఖరారైందని ఆరా తీశారు. ఆర్మూర్‌లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పాల్గొనగా, ఆయా కార్యక్రమాల్లో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, సహకార సంఘాల యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, సూపరింటెండెంట్ మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వినయ్‌కుమార్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు

ఆర్మూర్: ఎన్నికల హామీ మేరకు షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు. ఆర్మూర్‌కు వచ్చిన మంత్రిని కలిసేందుకు రైతు జేఏసీ నాయకులు వెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, రైతు నాయకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. భద్రతాకారణాల వల్ల పోలీసులు వారిని మంత్రి వద్దకు అనుమతించలేదు. చివరకు ఐదుగురిని మాత్రమే అనుమతిస్తామని పోలీసులు తెలుపడంతో మంత్రి వద్దకు వెళ్లిన రైతు నాయకులు పలు అంశాలపై మాట్లాడి వినతిపత్రం అందజేశారు. రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని, రైతుభరోసా అందజేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో రైతు జేఏసీ ప్రతినిధులు ఇట్టెడి లింగారెడ్డి, దేగాం యాదాగౌడ్, మంథని భూమారెడ్డి, సుక్కి సుధాకర్, వెల్మల్ రాజన్న, మోతె చిన్నారెడ్డి, నెంబర్ గంగారాం తదితరులున్నారు.

ఎక్సైజ్ సిబ్బంది వినతి..



మంత్రి జూపల్లికి వినతిపత్రం అందజేస్తున్న ఎక్సైజ్‌సిబ్బంది

ఖలీల్‌వాడి: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల మంత్రి జూపల్లి కృష్ణారావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గత 30 ఏళ్లుగా కింది స్థాయి సిబ్బంది ఎలాంటి పదోన్నతులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వీసులో చేరిన వారు ప్రమోషన్‌లు లేకుండానే పదవీ విరమణ పొందుతున్నారని మంత్రికి తెలిపారు. ఇతర యూనిఫామ్ శాఖల మాదిరిగానే తాము 24 గంటలపాటు విధులు నిర్వర్తిస్తున్నామన్నారు. కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లగా పదోన్నతులు కల్పించే అప్‌గ్రేడేషన్ ఫైల్ ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బదిలీలపై దృష్టి సారించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న టీఏ ఇతర అలవెన్స్‌లను మంజూరు చేయించాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో తెలంగాణ హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, చిట్టి నారాయణ తదితరులున్నారు.

తగ్గుతూ పెరుగుతున్న వరద

- ఆదివారం రాత్రి వరద గేట్ల మూసివేత
- సోమవారం మధ్యాహ్నం ఆరు గేట్లు ఎత్తి నీటి విడుదల
- 40వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



వరద గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో తగ్గుతూ పెరుగుతోంది. వరద తగ్గుముఖం పట్టగానే గేట్లను మూసివేస్తున్న అధికారులు.. ఇన్‌ఫ్లో పెరిగితే వరద గేట్లను ఎత్తుతున్నారు. ఆదివారం రాత్రికి ఇన్‌ఫ్లో తగ్గడంతో 10 గంటలకు గేట్లను మూసివేసి నీటి విడుదలను నిలిపివేశారు. సోమవారం మధ్యాహ్నం మళ్లీ వరద పోటెత్తడంతో ఆరు గేట్లనుఎత్తి దిగువకు 18,744 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 40 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉందని ప్రాజెక్టు అధికారులు అంటున్నారు.

88 టీఎంసీలు గోదావరి పాలు..

ఈ ఏడాది ఇప్పటి వరకు 88 టీఎంసీల నీరు గోదావరిలోకి వదిలారు. వరద కాలువ ద్వారా 25.5 టీఎంసీలు, కాకతీయ కాలువ ద్వారా 19.82, సరస్వతి కాలువ ద్వారా 1.01, లక్ష్మి కాలువ ద్వారా 0.33, ఎస్కేప్ గేట్ల ద్వారా 3.83 టీఎంసీల నీటిని విడుదల చేయగా, ఆవిరి రూపంలో 4.47 టీఎంసీల నీరుపోయింది. మిషన్ భగీరథ ద్వారా 2.43 టీఎంసీలు, అలీసాగర్ ద్వారా 0.10 టీఎంసీలు, గుత్ప లిఫ్ట్‌కు 0.06 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ఇప్పటి వరకు 220 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

కొనసాగుతున్న నీటి విడుదల

కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 6,800 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 1200, లక్ష్మి కాలువ ద్వారా 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరుపోతోంది. వరద కాలువ ద్వారా 10 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్‌పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉంది.

క్రైం కార్నర్

ఆస్పత్రి బాత్రూమ్‌లో రోగి ఆత్మహత్య

- వ్యాధి నయం కావడం లేదనే మనస్తాపంతో..



సాయిలు (ఫైల్)

కామారెడ్డి క్రైం: వ్యాధి నయం కావడం లేదనే మనస్తాపంతో చికిత్స పొందుతున్న ఆస్పత్రిలోని బాత్రూమ్ లోనే ఓ పేషంట్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జీవదాన్ ప్రయివేట్ ఆస్పత్రిలో సోమవారం వేకువజామున జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. లింగంపేట మండల కేంద్రానికి చెందిన లింగాల సాయిలు (45) కొద్ది రోజులుగా షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. చేతికి తగిలిన గాయం ఇన్ఫెక్షన్ కావడంతో వారం రోజుల క్రితం కామారెడ్డిలోని ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడు. వైద్యం అందించి సెప్టెంబర్ 25న డిశ్చార్జ్ చేశారు. ఇన్‌ఫెక్షన్ తిరగబడటంతో సెప్టెంబర్ 29 న వచ్చి మళ్లీ అడ్మిట్ అయ్యాడు. తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో బాత్రూమ్‌కు వెళ్లిన సాయిలు టవల్‌తో కొక్కానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ సమయంలో అతని భార్య, ఇతర కుటుంబ సభ్యులు కూడా ఆస్పత్రిలోనే ఉన్నారు. ఘటన జరిగిన సమయంలో అక్కడున్న వారంతా నిద్రలో ఉన్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. పట్టణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ



సుభాష్‌నగర్: నగరంలోని ఆర్యనగర్ పెట్రోల్‌బంక్ వద్ద లారీ అదుపుతప్పి సోమవారం సాయంత్రం డివైడర్‌ను ఢీకొట్టింది. డ్రైవర్ అజాగ్రత్త కారణంగానే లారీ డివైడర్‌ను ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు. కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత లారీని అక్కడి నుంచి తొలగించడంతో ట్రాఫిక్ క్లియర్ అయ్యింది.

చైనా మాంజా పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పెద్ద బజార్ ప్రాంతంలో చైనా మాంజా అమ్ముతున్నారనే సమాచారం మేరకు ఆదివారం రాత్రి టాస్క్ ఫోర్స్ దాడి చేశారు. ఎస్‌కే కైట్ షాపులో రూ.1.09లక్షల విలువైన చైనా మంజా లభ్యమైనట్లు ఎస్సై యాసిన్ అరాఫత్ తెలిపారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని, చైనా మాంజాను ప్రభుత్వం నిషేదించిందన్నారు.

నాటుతుపాకీ స్వాధీనం



ఎల్లారెడ్డి: రేంజ్ పరిధిలోని లక్ష్మాపూర్‌లో నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు అటవీశాఖ అధికారి ఓంకార్ సోమవారం తెలిపారు. గ్రామంలోని ఓ వ్యక్తి వద్ద నాటు తుపాకీ ఉన్నదనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న నాటుతుపాకీని పోలీసులకు అందజేశామన్నారు. అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు శ్రీనివాస్ నాయక్, పృథ్వీరాజ్, సెక్షన్ ఆఫీసర్ విక్కీ మార్టిన్, బీట్ ఆఫీసర్ పిచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి

నదిలో గల్లంతైన మహిళ ..



జయ(ఫైల్)

డిచ్‌పల్లి: బాసర గోదావరిలో గల్లంతైన మండలంలోని ధర్మారం(బి) గ్రామానికి చెందిన కర్రోళ్ల జయ మృతదేహం సోమవారం లభ్యమైందని గ్రామస్తులు తెలిపారు. కర్రోళ్ల జయ తమ్ముడు కోటిరి రవి, అతడి భార్య కృష్ణవేణి కుటుంబ సభ్యులతో కలిసి గతనెల 27న బాసరకు వెళ్లారు. పుష్కరఘాట్ వద్ద స్నానాలు చేస్తుండగా ప్రమాదవశాత్తు జయ, కృష్ణవేణి ఇద్దరు కొట్టుకుపోగా, కృష్ణవేణిని జాలరులు కాపాడారు. జయ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. గోదావరిలో కొట్టుకుపోయిన జయ మృతదేహం సోమవారం కాళేశ్వరం వద్ద లభించింది. ఆమె మృతితో ధర్మారంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చెరువులో పడి..

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని మైసమ్మ చెరువులో ప్రమాదవశాత్తు పడి అవుటివార్ హులరాం(35) అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై విజయ్ కొండ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మహారాష్ట్రలోని దెగ్లూర్ తాలుకా కూతుమాపూర్ గ్రామానికి చెందిన అవుటివార్ హులరాం కొద్దిరోజులుగా మద్నూర్‌లోని తన అక్క హుల్లుబాయి ఇంట్లో ఉంటున్నాడు. గతనెల 28వ తేదీన సాయంత్రం కాలకృత్యాలు తీర్చుకునేందుకు మైసమ్మ చెరువుకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులోపడి మృతి చెందాడు. చెరువులో మృతదేహం ఉన్నట్లు సోమవారం సమాచారం అందిందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పరిస్థితి విషమించి యువకుడు..



ఆదర్శ్ కుమార్ (ఫైల్)

మోపాల్: మండలంలోని న్యాల్‌కల్ గ్రామానికి చెందిన కంటిగారి ఆదర్శ్‌కుమార్ (33) సోమవారం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. ప్రైవేట్ ఉద్యోగం చేసే ఆదర్శ్‌కుమార్ అప్పులు పెరిగిపోవడంతో మనస్తాపానికి గురై బుధవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పోచారం ప్రధాన కాలువలో మునిగి..



లక్ష్మణ్(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గోపాల్‌పేటకు చెందిన గోరుకుల లక్ష్మణ్(23) అనే యువకుడు ప్రమాదవశాత్తు పోచారం ప్రధానకాలువలో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గత నెల 28న తన అమ్మమ్మ మరణించడంతో అంత్యక్రియలకు హాజరైన లక్ష్మణ్ స్నానం చేసేందుకు పోచారం ప్రధాన కాలువ వద్దకు వెళ్లాడు. ఆ తరువాత ఇంటికి రాకపోవడంతో లక్ష్మణ్ ఆచూకీ కోసం కుటుం సభ్యులు వెతికారు. మూడు రోజుల తరువాత సోమవారం ఉదయం లక్ష్మణ్ మృతదేహం గోపాల్‌పేట గ్రామసమీపంలోని కాలువలో కనిపించింది. తన కొడుకు ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడని మృతుడి తండ్రి రమేశ్ ఫిర్యాదు చేశాడని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మల్లారెడ్డి తెలిపారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

నిజామాబాద్‌అర్బన్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 62 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అదనపు కలెక్టర్లు కిరణ్‌కుమార్, అంకిత్‌తోపాటు డీఆర్డీవో సాయాగౌడ్, నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డికి అర్జీలు అందజేశారు. ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు మంజూరు చేయండి



ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తున్న జంగం గంగాధర్, సాగర్

ఎడపల్లి(బోధన్): గ్రామపంచాయతీల పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి బకాయి వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ వెల్ఫేర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ సోమవారం ప్రజావాణిలో అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. 9నెలల బకాయి వేతనాలను చెల్లించడంతోపాటు దసరా కానుకగా దుస్తులు పంపిణీ చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్, సహాయ కార్యదర్శి సాగర్, జిల్లా ఉపాధ్యక్షులు జే పద్మ తదితరులున్నారు.

బాల్‌బ్యాడ్మింటన్‌లో బాలుర జట్టుకు తృతీయస్థానం



నిజామాబాద్‌నాగారం: జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర బాలుర జట్టు తృతీయస్థానంలో నిలిచింది. గత నెల 25 నుంచి 29వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలోని రోహ్‌తక్‌లో 43వ జాతీయ సబ్ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ చాపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. సెమీఫైనల్స్‌లో తమిళనాడు జట్టుపై 27-35, 28-35 తేడాతో ఓడిపోయిన జిల్లా జట్టు థర్డ్, ఫోర్త్ ప్లేస్ మ్యాచ్‌లో బీహార్ జట్టుపై విజయం సాధించి తృతీయ స్థానంలో నిలిచింది. రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించిన జిల్లా క్రీడాకారులు తమ సత్తాచాటారు. తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బంగారి స్వామి, ప్రధాన కార్యదర్శి వీవీ రమణ, బాల్ బ్యాడ్మింటన్ ఆఫ్ ఇండియా అడ్వైజర్ శ్రీనివాస్‌రావు, వీరభద్రరావు, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు మానస గణేశ్, కార్యదర్శి శ్యామ్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, రాజేశ్వర్, కష్ణమూర్తి, నగేశ్, సురేశ్, సురేందర్, తదితరులు క్రీడాకారులను అభినందించారు.

లోక్ అదాలత్‌లో రాజీకి రాలేదని ఆత్మహత్య

- ఫిర్యాదుదారు ఇంటి ఎదుట పెట్రోల్ పోసుకున్న వ్యక్తి
- పరిస్థితి విషమించి ఆస్పత్రిలో మృతి

నిజామాబాద్ రూరల్: గొడవ కేసులో లోక్ అదాలత్ ద్వారా రాజీకి రావాలని కోరగా, ఫిర్యాదుదారు డబ్బులు డిమాండ్ చేయడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. అద్దె ఇంట్లో ఉంటూ మేస్త్రి పని చేసుకుంటూ జీవిస్తున్న శ్రీహరి(45)కి ఎదురింట్లో ఉన్న కళావతి అనే మహిళతో గతంలో గొడవ జరిగింది. కళావతి ఇంట్లోకి వెళ్లి వారి కుటుంబంపై దాడి చేశాడని శ్రీహరితోపాటు మరో నలుగురిపై కేసు నమోదైంది. ఇటీవల లోక్‌అదాలత్‌లో కేసు రాజీ కుదుర్చుకుందామని శ్రీహరి కళావతిని కోరగా, ఆమె రూ.5లక్షలు డిమాండ్ చేసింది. అంతమొత్తం ఇచ్చుకోలేనని తీవ్రమనస్తాపానికి గురైన శ్రీహరి బుధవారం రాత్రి కళాశాతి ఇంటి ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. స్థానికులు ఆయనను జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శ్రీహరి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కళావతిపై కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

చిన్నారులకు వాతలు పెట్టిన తల్లి

- పోలీసులకు ఫిర్యాదు చేసిన స్కూలు ఉపాధ్యాయులు, హెడ్మాస్టర్



తల్లి వాతలు పెట్టడంతో ముఖం, చేతులపై కాలిన గాయాలతో చిన్నారులు

కామారెడ్డి టౌన్: కన్నతల్లే తన పిల్లలపై కర్కశంగా వ్యవహరించిన ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని బడాకసాబ్ గల్లిలో నివాసం ఉంటున్న ఓ మహిళకు ముగ్గురు సంతానం. వీరిలో చిన్నవాడైన మూడేళ్ల బాలుడు ముదాంగల్లిలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల అవరణలోని అంగన్‌వాడిలో చదువుతుండగా, మిగతా ఇద్దరు బాలికలు అదే పాశాలలో 2, 4వ తరగతి చదువుతున్నారు. అయితే బాలుడితో పాటు 2వ తరగతి చదువుతున్న బాలికకు ఆదివారం తల్లి పొయ్యిలో నుంచి కర్ర తీసి ముఖం, చేతులపై వాతలు పెట్టి గాయపరిచింది. సోమవారం స్కూల్‌కు వచ్చిన పిల్లల ముఖం, చేతులపై కాలిన గాయాలను గమనించిన ఉపాధ్యాయులు, హెచ్‌ఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే తల్లిని స్కూల్‌కు పిలిపించారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. పిల్లలు ఇంట్లోని దేవుడి వద్ద డబ్బులు తీయడంతో అలా చేసానని, మరోసారి చేయనని ఆమె అందరినీ వేడుకుంది. పోలీసులు, ఉపాధ్యాయులు మహిళ తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. అయితే చిన్నారులను గాయపర్చిన ఘటనలో మహిళతో పాటు మరో వ్యక్తి ఉన్నట్లు స్థానికుల ద్వారా తెలిసింది.

3.2 కిలోల గంజాయి పట్టివేత



ఎక్సైజ్ పోలీసుల అదుపులో ఉన్న గోబీర్య

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని శివాపూర్ చౌరస్తాలో ఎక్సైజ్ పోలీసులు సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి వద్ద 3.2కిలోల ఎండు గంజాయితో పట్టుబడ్డాడు. పోచారం తండాకు చెందిన బర్దావాల్ గోబీర్య అనే యువకుడు గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడని అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలింఇనట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. తనిఖీల్లో ఎస్సై నగేశ్, సిబ్బంది శ్రీధర్, సందీప్ రెడ్డి, శ్రీకాంత్, అనిత పాల్గొన్నారు.

కబ్జాదారులపై కేసు నమోదు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాల్తుమ్మెద విత్తనోత్పత్తిక్షేత్ర భూమిని కబ్జా చేసిన నలుగురిపై సోమవారం కేసునమోదు చేసినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిపేట గ్రామానికి చెందిన కుమ్మరి పోచయ్య, కుమ్మరి విజయ్, సిరికొండ భూమయ్య, సిరికొండ నాగరాజు విత్తనక్షేత్రం సర్వే నం.834లోని ప్రభుత్వ భూమి ఫెన్సింగ్, కడీలను తొలగించి సుమారు నాలుగు ఎకరాల భూమిని దున్ని, వరినాట్లు వేశారని క్షేత్రం ఏడీఏ హరివెంకటప్రసాద్ ఫిర్యాదు చేశారని, భూమిని కబ్జాచేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పరామర్శ



బాన్సువాడ : రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తం రెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా, మంత్రిని వ్యవసాయసలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. పురుషోత్తమ్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు.